# వివాహ మంగళం

దారి గతుకులు గతుకులుగా ఉంది. కత్తిరగడ్డలూ అదీనూ. కాస్సేపు సజావుగా నడుస్తుంది బండీ, కాస్సేపు నడవదు. అక్కడకీ ఎడ్లను తిడుతూ, అరుస్తూ తోక మెలివేస్తూ తోలుతున్నాడు బసవయ్య. చీమ నడిచినట్లు నడుస్తోంది గానీ, చరచరా సాగిపోవటం లేదు.

"ల్లాంల్లాం, బొబ్బ !"

"వాసే, వీడికి మంచి నీళ్ళట చూడూ !" అన్నాను. తాబేటి కాయ తీసి నాకేసి చూసింది కాముడు పిల్లలు ఇంతే అన్నట్లు. "బండీ ఆపవోయ్" అని ఆపించాను. బండి ఆగింది. తాబేటి కాయలో నీళ్ళు కొమ్ము చెంబులో పోసి, వాడి నోటి కందించింది కాముడు. మంగళగిరి పానకాలరాయుడులాగా సహం తాగి, మిగతావి పారబోశాడు వాడు. మళ్ళీ బండీ నడక మొదలు పెట్టింది. దీపాలు పెట్టాక ఊరు చేరాం.

పెళ్ళి ఇల్లు పెళ్ళి ఇల్లే. దానికి పోలికేమిటీ ! వాకిట్లో ఇలాయి బుడ్లు వెలుగుతున్నాయి. లోపల వెన్నముద్దల్లాగా గాస్ లైట్లు కొట్ట వస్తున్నవి. నెమ్మదిగా బండి దిగి, బాబుని బుజాన వేసుకుని నడుస్తున్నాను. కాళ్ళ పాంజేబులు సవరించుకొని కాముడూ వెంట వొస్తోంది. బసవయ్య ట్రంకు పెట్టె తెస్తున్నాడు.

"పెద్దబావ వొచ్చాడు !"

అంతా ఒక్కసారి మాకేసి చూశారు. మా మామగారి అన్నదమ్ముల పిల్లల్లో కాముడే పెద్దది. అందుచేత అందరికీ నేను పెద్దబావను. వంటిట్లో గాడిపొయ్యి దగ్గర మగ్గిపోతూన్న వాళ్ళు దగ్గిర్నుంచీ వచ్చి పరామర్శ చేశారు. కాళ్ళు కడుక్కొని, మంచీళ్ళు తాగి, చొక్కా గుండీలు ఊడతీసి, అమ్మయ్య అనుకుని చాపమీద కూల

బడ్డాను. దారిలో ఎండ దెబ్బ తిన్నామేమో ప్రాణం అప్పటికి కుదుట పడ్డది.

కాముడు పిల్లాణ్ణి తీసుకుని లోపలికి చక్కా పోయింది.

"ఆలస్యమైందేరా!" తల తిప్పి చూశాను. సూర్నాణ!

సూర్నాణ మా బావమరిదికి బావమరిది.

బందరులో ఓ గదిలో ఉండేవాళ్ళం మేం. అల్లరి చెయ్యడంలో నిధి సూర్నాణ. జామకాయల దాన్ని పిలిచి, బేరమాడి, పళ్లు చక్కగా లేవా అని అది అంటే, నీవు చక్కగా లేవా అని చివాట్లు తిన్నాడు సూర్నాణ.

"వెధవ బస్సు మోసం చేసిందిరా"

"మేమూ ఇప్పుడే వచ్చాం"

"కులాసా?"

"ఆహా! దేముడి దయవల్ల కులాసే. కాస్త స్నానం చెయ్యిరా, హాయిగా ఉంటుందీ."

ఆ మాట ఎవరన్నా అంటారా అనే నేను ఎదురు చూస్తున్నాను. సూర్నాణ అన్నాడు గానీ అత్తారి తరపు ఎవరన్నా అనాలిసింది మరి.

"చె—య్యాలి" అన్నాను బరువుగా.

"ల్లాల్లా—బొబ్బ పోచుకో!" కాముడి కబురు. అమలు జరిపి తీరాలి మరి. లేచి, చొక్కా విప్పుతున్నాను.

"కాస్త స్నానం చెయ్. ప్రాణం తెరిపిన పడుతుందీ!"

—పిన మామగారు. ఇహ తప్పేట్టు లేదనుకుని, దొడ్లోకి వెళ్ళి, స్నానం చేసి, వంట పాకదగ్గిర కాముడు చేయించిన కాఫీ ఆదరా బాదరా తాగి, వాకింటి ధోతీ పింజలుపోసి కట్టుకుని కూచున్నాను. బాతాఖానీ

వేద్దామంటే సూర్నాణ లేదు. ప్రద్దీ ఇంతే. మన అవసరానికి ఎవరూ కలిసిరారు. కాస్సేపు వీధివాకిట్లో కూచ్చొని, సిగిరెట్లు చాటుగా తగలేసి, మళ్ళీ వచ్చి నలుగురిలో పచార్లు చేస్తున్నాను.

"మడి కట్టుకోండి!" అంది పెళ్ళికూతురు.

"మనం ఎప్పుడూ మడే"

—మరదలు.... ఆ మాత్రం అనకపోవడం నామర్దా.

"వెటకారాలకు పోక, పట్టుబట్ట కట్టుకోండి!" కాముడు సన్నగా సన్నాయి నొక్కులు నొక్కింది. మంచి మందు చేదుగా ఏడుస్తుంది. మంచి పెళ్ళాం చాటుగా కోప్పడుతుంది. చిత్రం.

"చిత్తం"

పట్టుబట్ట కట్టుకొని, మడిగా అడుగులు ఎత్తెత్తి వేస్తూ, పెళ్ళి శిష్టపంక్తిలో భోంచేసి వచ్చాను. పొద్దున్నించీ ప్రయాణమేమో ప్రాణాలు కడబట్టి ఉన్నాయేమో.... కనుబొమ్మల మీద నిద్దర ఉయ్యాల ఊగుతోంది. పోయి నడుం వాలుద్దామంటే— ఎక్కడ ఎవరు పిలుస్తారో అని గుంజాటన పడుతున్నాను. అక్కడికీ తెగించి సామాను గది అవతల చిరిచాప పరిచాను.

"బావ ఎక్కడ?"

—నన్నేనా? ఆహా, నన్నే. లేచి ఏదో వెతుకుతున్నట్లు నటిస్తున్నాను.

"దావయ్యా బావా, పానకం కావిళ్ళకు వెళ్ళాలి!"

వినీ విననట్లు నటించి ఇవతలకు చక్కా వచ్చాను. కాముడు కూడా స్నానంచేసి, ఇస్త్రీ మడత తెల్లచీర కట్టుకుని, హడావిడిగా తిరుగుతోంది, ఇత్తడి పళ్ళెం చేత పుచ్చుకుని.

ప్రవేశ సంఖ్య 28017

"వాడెక్కడ?"

"ఎవరూ?"

"నీ మొహం, ఎవరేమిటీ, బాబు!"

"నిద్దరోతున్నాడు"

"నీ పుణ్యమాయిరి, వాణ్ణిప్పుడప్పుడే లేపకు. పాక పీకి పందిరేస్తాడు!"

ఈ నాలుగు మాటలూ వినడానికి తీరికంటూ వుందా దానికి, తుర్రున పడమటింట్లోకి వెళ్ళింది. పసిపిల్లాడిలాగా వెంట నేనూ వెళ్ళాను. "వేలివరుగు" తయారై ఉంది. ముగ్గులు వేశారు. నవధాన్యాల కోసం కొత్త మూకుళ్ళు తెచ్చి ఉంచారు. పసుపూ, కుంకుమా, అక్షింతలూ, పసుపుతాడు కట్టిన పెద్ద బుట్టా, పెళ్ళి పీటా అన్నీ అమర్చి ఉన్నై. ఇరుకైన గదేమో, మహ ఉడకపోస్తోంది. తరుముకు వచ్చినట్లు కాముడు గమనించకుండా, "చొక్కా ఉత్తరియ్యం ఈ" అన్నాను.

చేతులో ఉన్న పళ్ళెం కిందపెట్టి, మంగళ సూత్రాల్లో దూముడి వేసిన తాళం చెవి తీసి ఇచ్చింది.

"అబ్బ, నువ్వే ఇద్దూ, ఆ పెట్టె ఎక్కడుందో వెతకాలి" అన్నాను. పెదిమలమీద నవ్వు చక్కా వొచ్చింది తీవిగా.

తెల్లని చీర, తెల్లని రవిక, తెల్లని మల్లెపూలు, సర్వశుక్లా సరస్వతీ అన్నట్లు ఉంది కాముడు.

ఈ ఆడపిల్లలది మరీ విచిత్రం. నీ దగ్గిర నువ్వు అరచేతిలో ఆడిస్తూ తల్లో పువ్వులాగా చూసినాసరే, ఎంత సొతంత్రం ఇచ్చినా సరే, పంజరంలో చిలకలాగా ఉంటారు. పుట్టింటికంటూ వెళ్ళారో—నీటిలో చాపల్లాగా తిరుగుతారు.

బహూ తొందరగా చొక్కా తొడిగి, ఉత్తరీయం అలవోకగా పైనవేసి, నేనూ బయలుదేరాను. విడిదిలోకి వెళ్ళి, వరపూజ చేసి, పానకం కావిళ్ళు చదివించి, బంధువులచే పానకం తాగించి, చక్కా వచ్చాం. పెళ్ళికొడుకు వారు బంధు సమేతంగా వచ్చారు.

తాషా మరపా వాయిస్తున్నారు. రాండోళ్ళు మోగుతున్నై. సన్నాయివాడు త్యాగరాజ కీర్తనల్ని వాయిస్తున్నాడు. అందరూ కాళ్ళు విరగతొక్కు కుంటున్నారు. ఆడవాళ్ళు తీర్చిదిద్దిన ప్రతిమలవలె కూచు న్నారు. పెద్దలు కూచున్నారు. లోకాభిరామాయణం విడిపడింది. మంత్రాలు హోరెత్తుతున్నాయి. వరుడు॥మదర్ధం కన్యాం వృణీధ్వం" అని తగిన పెద్దల్ని ఏర్పాటు చేశాడు.

అక్కడ గౌరీపూజ జరిగింది.

ఫలానవారి ఫలానవారి అమ్మాయిని ఫలానావారి ఫలానావారి అబ్బా యికీ అని పెద్దలు మంత్రాలతో నిశ్చయపరిచారు. తట్టలో కూచో పెట్టుకుని పెళ్ళికూతుర్ని మేనమామ పెళ్ళిపీట దగ్గిరికి తెచ్చాడు.

ఎన్నిసార్లు విన్నానో ఈ మంత్రాల్ని. ఎన్ని సార్లైనా వినాలని ఉంటుంది. అందులోనూ పెళ్ళిమంత్రాల్ని. పెళ్ళప్పుడు నిద్రని నిద్రకు పంపి, చెవులు రిక్కపెట్టుకు వింటున్నాను. బెల్లమూ, జీలకర్రా వధూ వరుల ఓరినెత్తిన ఓపు పెట్టుకున్నారు. నా పెళ్ళి, ఆనాటి సంబరం, తెర తీయగానే ఆశతో నేను పెళ్ళికూతుర్ని చూడటం, అదీ చాటుగా నన్ను చూడటం, అన్నీ గుర్తుకు వచ్చై. బాబు నా వొళ్ళో గంతులేస్తున్నాడు.

కట్నాలు చదివించారు. పసుపూ కుంకుమా చల్లి, పెద్దపళ్ళెముడు రూపాయలు ఆ కొత్తఅల్లుడికి ఇచ్చారు. నాకు నిద్ర ముంచుకొస్తోంది.

తలంబ్రాలు పోయిస్తున్నారు. ఒకరిని మించాలని ఒకరు తలంబ్రాలు పోస్తున్నారు.

'సద్యో దీ—క్షయంతీ—దీక్ష–యంతి సద్యః దీక్ష—యంతీతి. దీ—క్షా—యం—తీ—తి'

అంటూ సాగదీస్తూ బ్రాహ్మలు మంత్రాలు చదువుతున్నారు. నేను కూచోలేక పోయాను. నిద్ర.

లేద్దామని ఇట్టే చూచేసరికి వాళ్ళో బాబులేదు. కళ్ళు మూతలు పడుతున్నై. శరీరం అంతా నలిగిపోయి ఉంది. కళ్ళముందు ఎర్ర ఎర్రగానూ, ఆకుపచ్చగానూ ఏవేవో తిరుగుతున్నట్లు కనబడుతున్నై. మైకంతో తూలినట్లు వొళ్లు తూలుతోంది. బాబుసంగతి జాగర్త చెబు దామని కాముడికేసి చూద్దును గదా అది కనబడదు. కనురెప్పలు విడచు కున్నట్లు బలవంతాన ఆణవాళ్ళ మొహాలు వెతికాను. ప్చ్. ఎక్కడా కనబడలేదు. ఏమైతే అయ్యిందని సరాసరి లోపలికి పోయాను. ఆణవాళ్లు దారిలోంచి వైదొలిగారా లేదా అని చూసుకోకుండానే సరాసరి పోతున్నాను.

సామాన్ల గదిలో నేనిందాక పరిచిన చాపలేదు. నా బుద్ధి తక్కువ గాని పెళ్ళిలో ఎక్కడ సామాను అక్కడ వుంటుందా మరి. పెట్టెలూ పసుపుచుట్టలూ ఉన్న గదిలోకి పోయాను. పడుక్కోడానికి వీలుగానే ఉంది. వెళ్ళి నడుంవాల్చాను. పక్కన కాముడు కాబోలు పడుకుని ఉంది. నడుం వాల్చానో లేదో, నిద్ర కళ్ళను మూసేసింది. ఆవలింత వచ్చింది. ఆ తర్వాత స్పృహే లేదు. అటూ ఇటూ మైకంగా పొర్లుతున్నాను. మీద చెయ్యి పడ్డది. గాజులు గలగలమన్నై. సమతూకంగా ఊపిరి చప్పుడౌతోంది. అంతా కలలోలాగా ఉంది. నేనూ జరిగాను. ఆ అమ్మాయి నా కేసి జరిగింది. ఇంకా దగ్గిరసా జరిగాం. సంస్కారం ఎంత శక్తి వంతంగా మనిషిని పరిపాలన చేస్తుందో, తలుచుకుంటే అంతగానూ

శరీరమూ పరిపాలన చెయ్యగలదు. బుద్ధి దాస్యం చెయ్యకుండా అదమా యించక పోతే——

చెమటా, మల్లెపూలూ, ఎండినగంధం, దవనం, ఇస్త్రీ మడతలు కలిసిన వాసన మత్తెక్కిస్తోంది. అవతలి వ్యక్తిని గట్టిగా అదుము కున్నాను. శరీరం విజృంభించింది. చెమటతో తడిసిన రవిక చిరిగింది. ఎందుకో కొట్టవచ్చినట్లు మెళకువ వచ్చింది. కాముడు కానేకాదు. శివ శివా, ఎవరా అని పరకాయించాను. సూర్నాణ భార్య. నా అలికిడికి ఆ అమ్మాయి కళ్ళు విప్పింది. ఏమనుకుందో.

నన్ను ఉవ్వెళ్ళూరించని స్త్రీ, నా ఆత్మను ఘోష పెట్టించని స్త్రీ, నాది కానేకాదు. నాది కానిదల్లా నాదేనని ఏడవటం నా చేత కానేకాదు. పడుకుని ఉన్నది కాముడే అనుకోకపోతే, కొంతైనా శరీరాన్ని బుద్ధి గదమాయించి ఉండేది. ఆ అమ్మాయి కూడా పరాయివాడని అనుకుంది కాబోలు.... ....మొహం చిట్లించింది. రాంఢోళ్ళు నాచెవిలో ఇంకా మోగుతూనే ఉన్నాయి. అవతల స్థాళీపాకం కాబోలు జరుగుతోంది.

"జరిగిన తప్పు బుద్ధి పూర్వకంగా చేసినదికాదు. క్షమించండి" అన్నాను. ఆవిడ ఏమనాలో తెలీక చూస్తోంది.

"ల్లాఁల్లాఁ!" బాబు వొస్తున్నాడు.

"దా, నాన్నా దా!"

"ల్లాఁల్లాఁ——" అంటూ ఆవిడ ఎవరని చూస్తున్నాడు బాబు.

ఆమె పైట సర్దుకుంది.

"అత్తయ్య! దణ్ణం పెట్టూ" అన్నాను.

"అత్త" అంటూ బాబు దణ్ణం పెడుతున్నాడు.

"బాబు ఉన్నాడా" అంటూ కాముడు చక్కా వచ్చింది.